# మిథునం

ఇదొక ప్రేమ కథ!

టీనేజ్ ప్రేమ కథకాదు. అనుబంధాల ప్రేమ కథ.

రెండు మనసులు ఏకమైన ప్రేమకథ... రెండు గుండెల నిండైన ప్రేమకథ...

ఒక్కటైన రెండు జీవితాల నిఖార్సయిన ప్రేమకథ...

✤ ✤ ✤

పొద్దుకి సంధ్యకి సంధికాలం.

సూర్యకిరణాలు వార్ధక్యపు ముసుగేసుకొని పడమటి కొండల మాటుకి ఒరిగి కనుమరుగవుతున్నాయి. రుక్మిణమ్మ హృదయంలో ఘనీభవించిన కన్నీరు ఆమె గాజు కళ్ళలోంచి మంచుముద్దలై రాలి పడుతోంది.

భర్త కృష్ణమూర్తి గుండెపోటుతో మరణించి పది రోజులవుతోంది.

ఆవిడకు మాత్రం సెకనొక యుగంలా, భారంగా, బాధగా కాలం గడుస్తోంది.

శ్రీవారితో పెనవేసుకున్న పచ్చని జ్ఞాపకాలు, వెచ్చని ఘడియలు... ఒంటరి ఎడారి పయనంలో ఒయాసిస్సుల్లా గుండె చెలిమిని నింపుతున్నాయి. మనసు మూలాల్ని తడితడిగా తడుపుతున్నాయి.

చిన్నారి పాప తండ్రి నులివెచ్చని ఒడిని చేరి మైమరచినట్టు-

ఆ రోజు భర్త ఒడిలో తల దూర్చి సేద దీరుతున్న తన తనువుని ఆయన హృదయస్పర్శ ప్రేమగా తడుముతున్నట్టుగానే ఉంది... ఇప్పటికీ!

ఆ దృశ్యం... అదృశ్యం కాకుండా... తిరిగి సజీవమవుతోంది....

"మీ ఒడిలో ఇలాగే నిండు ముత్తైదువగా ఆనందంగా కనురెప్ప వాల్చాలని ఉంది" పొడిబారిన ఆమె పెదాలు ఆర్ద్రతగా ఎదలోగిలిలోని ఆకాంక్షని వెలిబుచ్చుతుంటే చప్పున

భార్య పెదాలను తన వేళ్ళ కొసలతో సుతారంగా అదిమేశాడు.

ఆ స్పర్శే... ఆ కరుణామయ కరస్పర్శే... ఏడడుగులు చేయిపట్టి నడిచిన ఆనాటి నుండి... అనురాగ స్పర్శగా మారి... ఆమె హృదయ ఫలకాన్ని... ఆప్యాయతతో పెనవేసుకు పోయింది.

"వద్దు రుక్మిణీ! ఈ జన్మకు నీకావరమొద్దు. నీ ఎడబాటు నే తట్టుకోలేను. పిల్లలు మనం కోరుకున్నట్టే ఉన్నత స్థితికి చేరారు. మన పేరు నిలబెట్టారు. ఈ వయసులో మనని అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు.

మనవలు, మనవరాళ్ళు ఎదుగుతున్నారు. వాళ్ళు కూడా ఆప్యాయతని చవిచూపిస్తున్నారు. ఏ దంపతులకైనా ఇంతకంటే కావాల్సిందేమీ లేదు.

అయినా నా పరంగా ఏదైనా కోరిక ఇంకా మిగిలి ఉందీ అంటే ఇదొక్కటే... నీకంటే ముందు నేను నిష్క్రమించాలని..." అలసిన అతడి గుండె శబ్ద తరంగాలై అలలుగా రుక్మిణమ్మ ఎద పొదల్ని కంపింప చేసి తెగ కలవర పరిచింది.

ఊహించని ఆ మాటకి... ఆయన భావనకి... నిలువెల్లా కదలిపోయింది.

వెంటనే-

"ఏం? ప్రతి ఘడియా నన్ను కనుపాపలా కనిపెట్టుకుని ఉంటూ, పక్షవాతంతో పడిపోయిన నా కుడి చేయీ కాలుకి మందూ మాకూ రాస్తూ, వేళకి మందులిస్తూ, నిత్యం సేవలు చేయాలంటే కష్టంగా ఉందా?" అనడిగింది సగభాగమే స్వాధీనంలో ఉన్న కంఠంతో.

అస్పష్టంగా, అలసటగా, ఆరోపణగా పెదవిని సగానికి విరుస్తూ కృష్ణమూర్తి అన్నాడు కదా.

"పిచ్చిరుక్కూ! అవసానదశలో ఉన్న తల్లిదండ్రులని ఆదరించే భాగ్యం కలగడం సంతానం చేసుకున్న అదృష్టం. తన భార్యకి ప్రేమతో సేవలందించే అవకాశం కలగడం ఆ భర్తకి నిజంగా వరమే!"

పక్షవాతం సోకిన తన జీవన సగభాగపు భాగాన్ని ఆర్తిగా తడుముతూ మంచంపైకి వంగి, పడుకొని ఉన్న భార్యని అలవికాని అనురాగంతో హత్తుకున్నాడు అనునయంగా.

నిశ్శబ్దం సైతం స్వచ్ఛమైన ఆ వృద్ధ దంపతుల వార్ధక్యపు కన్నీటి స్పర్శతో విషాదాన్ని పులుముకొని మరింత మూగపోయింది.

ఏడ్చి ఏడ్చి ఇంకిపోయాయి కన్నీళ్ళు. రుక్మిణమ్మ చూపులు నిస్తేజంగా ఉన్నాయి. ఆ చూపుల భావాలు నిర్వేదంగా ఉన్నాయి.

ఒక్కొక్కటిగా గుర్తుకొస్తున్న ఎన్నెన్నో జ్ఞాపకాల దొంతరలు తెరలు తెరలుగా మసకబారిన ఆమె మనోకుహరం ముందు మోకరిల్లుతున్నాయ్.

ఒక్క మాటైనా చెప్పలేదు. తను... తను అర్ధాంతరంగా వెళ్ళిపోతున్నానని!

ఏం? అరగంట అలా బజారుకెడితేనే అరవైసార్లు చెప్పిందే చెప్పి కదిలేవారే? ఇప్పుడెందుకిలా చేశాడీయన. రాత్రికి రాత్రే చెప్పకుండా దేహం వదలి పరలోకమేగి పోయాడు.

కనీసం... కనీసం... ఒక్క జాగ్రత్తయినా చెప్పలేదు. మందులు వేసుకోమనో! వేళకింత తినమనో! తనకోసం బెంగపెట్టుకోకు అనో!

ఒక్క రోజు ఊరెళ్తేనే పదే పదే చెప్పేవారు.

ఎలా ఉండాలో... పిల్లల్నెలా చూసుకోవాలో... ఒంటరిగా ఎలా మసలుకోవాలో... మరిప్పుడేంటిలా హఠాత్తుగా మాయమైపోయాడు.

పెళ్ళై ఏభై ఏళ్ళయ్యింది!

అన్నీ ఆయన అనుకున్నట్టే జరిగాయే?

చివరికి-

మృత్యువు విషయంలో కూడా!

తనే మొదట వెళ్ళిపోతానన్నాడు. పంతం నెగ్గించుకున్నాడు. ఒంటరిని చేసి వెళ్ళిపోయాడు. ఈ మంచంపై జీవచ్ఛవంలా నన్నిలాగే పడి ఉండమని శాసిస్తూ నిర్దయగా వదిలేసి వెళ్ళాడు.

ఇప్పుడు తను... ఎవరి పలుకులు వేదంలా వింటూ ఓదార్పు పొందాలి? మాటిమాటికీ శిలా ప్రతిమలా బిగుసుకుపోతోందావిడ. ఆమె నరనరాల్లోని ప్రతి రక్తపు కణం ఆక్రోశిస్తోంది. అతడి కోసం అలమటిస్తోంది.

నీటి చినుకు కోసం స్వాతి చిప్పలా... వాన స్పర్శ కోసం అవని ఘోషలా...

తనకింకా బాగా గుర్తు -

✣ ✣ ✣

ఆ రోజు తొలిసారిగా శిఖ ముడిచింది. పిల్లలు ఎదిగారు, వాళ్ళకి పెళ్ళిళ్ళయ్యాయి. అపుడో, ఇపుడో, మనవడో మనవరాలో ఇంట్లో అడుగిడబోతున్నారు. వయసుతో పాటు ఇలాంటి మార్పులు సహజమే కదా! అని శిఖ ముడిచింది. ఆ శిఖని మురిపెంగా అద్దంలో ఎన్నిమార్లు చూసుకుందని?

ఆఫీసు నుండొచ్చాక భర్త కూడా ఆనందపడతాడనుకుంది. కానీ జరగలేదలా.

కృష్ణమూర్తి భార్య వాలకాన్ని చూస్తూనే...

"రుక్కూ ఏంటలా? ఏవిటాపిచ్చి పని?" స్వరం పెంచకుండా చూపుల్లో మాత్రమే చిరుకోపం ప్రదర్శించాడు.

"తప్పదుగా" అందామె.

భర్తకి నచ్చే నవ్వుని... తనకి మాత్రమే సాధ్యమైన... వైవిధ్యమైన నవ్వుని.. అధరాల రేకులపైకి ఒంపుతూ...

మరోసారి, మరోసారయితే ఆ సొగసైన నవ్వుకి చిక్కేవాడే.

కానీ "వద్దురా! నాకలా నచ్చదు, ఎప్పటికీ్కాడా నీవు ఆ అందమైన జడతోనే కనబడాలి" అంటూ ఆ శిఖ విప్పి జడ అల్లేదాకా ఎంత పట్టు పట్టాడని?

✣ ✣ ✣

సడలని ఆ ప్రేమతోనే కదా ఈ అనారోగ్యపు అశక్తురాలికి రోజూ జడ అల్లుతోంది. సేవలందించడానికి కోడళ్ళు సుముఖంగా ఉన్నారు. పనివాళ్ళని నియమించడానికి కొడుకులు సంసిద్ధంగా ఉన్నారు.

అయినా 'స్వయంగా నే చేస్తేనే తృప్తి రుక్కూ!' అంటూ బదులిచ్చేవాడాయన.

'జీవితాంతం నాకు సేవలందించావు. ఈ క్షణాల్లో నన్నీ అవకాశం వినియోగించుకోనివ్వు' అంటూ సంతృప్తి పడేవాడు.

ఏవండీ!-

మీరు కనుమరుగై పది రోజులవుతోంది. ఇదిగో మీ చేతుల్తో అల్లిన జడ ఇంకా అలాగే ఉంది. రారూ? ఒక్కసారి... ఒకే ఒక్కసారొచ్చి మీ చేతుల్తో నా జుత్తునోమారు సవరించి వెళ్ళరూ! మూగవోయిన ఆ వృద్ధ మనసు... చిన్నపిల్లలా మారాం చేస్తున్నట్టు... ఎడబాటు సహించలేక పోతోంది.

'మీరేది చెబితే అది విన్నానే! ఎలా ఉండమంటే అలాగే ఉన్నానే! మరెందుకు విధించారు నాకీ కఠిన శిక్ష? జీవన్మరణ శిక్ష ! 'మీరంటే నాకెంతిష్టమని?' అని నేననుకొన్నాను గానీ నేనంటే మీకెంత ప్రాణమో! రోజులు గడుస్తుంటే తెలిసొచ్చింది. అందుకేగా, పసిదానిలా ఈ గుండె గోడు గోడున విలపిస్తోంది. పరితపిస్తోంది.

"ఒరే రుక్కూ! నేనన్న దానికల్లా బదులు తలూపడం తప్ప ఎదురు పెదవి విప్పడం తెలీని వెర్రి మొద్దువి. అందుకేరా నువ్వంటే నాకెంతో ఇది..." అంటూ ఆప్యాయతనంతా వెచ్చని ముద్దుగా చేసి నుదుటిని చుంబించిన ఆ తడి చుంబనాలని పదిలపరుచుకుంటూ ఉద్వేగంతో ఎడం చేత్తో అపూర్వంగా నుదుటినో మారు స్పృశించుకుంది.

✤ ✤ ✤

చత్వారం వచ్చిన తొలినాళ్ళలో మొదటిసారి కళ్ళద్దాలు తగిలించుకొన్నప్పుడు "ముసలివారయ్యారోచ్!" అంటూ శ్రీవారినెంతగా ఆట పట్టించిందని. అందుకు బదులుగా తనదైన చిలిపి పనుల్తో సరససల్లాపాల్తో ఆ రాత్రంతా జాగరణ చేయించి "ఇప్పుడు చెప్పవోయ్! ముసలినయ్యానా?" అంటూ ప్రేమగా బుగ్గలు నిమిరినపుడు తొలిరాత్రికి మల్లే సిగ్గులొలకబోసింది.

గుండెని కోసేలా తీయగా నవ్వేసాడాయన.

చప్పున మనసావాచా భర్తని గాఢంగా అల్లుకుపోయింది.

✤ ✤ ✤

ముక్కలవుతున్న వర్తమానం నాటి జ్ఞాపకాల తీపి మరకల్ని మనోఫలకంపై మరల మరల అద్దుతుంటే... పిడికెడంత గుండె పిసిరంత అవుతోంది.

గొప్ప వేదంతం వెలిబుచ్చానన్నట్టు ఆయన కళ్ళద్దాల్లోంచి ఇంతలేసి కళ్ళు చేసి తన వైపే ఆరాధనగా చూస్తూ "భర్త దూరమైనా, భార్య మాత్రం గుండె దిటవు చేసుకుని పిల్లల ధ్యాసలో కాలం వెళ్ళదీస్తుంది" అంటుంటే ముచ్చటేసింది రుక్మిణమ్మకు.

కళ్లింతలు చేసుకుని రుక్మిణిలా అంది కదా.

"పిచ్చి శ్రీవారూ! భర్త దూరమైన ఆడదాని బ్రతుకూ ఓ బ్రతుకేనా? మా స్త్రీ హృదయాలెప్పటికీ మీ మగ మనసులకి అర్థం కావు! కానేకావు!"

అప్రయత్నంగా పెదవులు విడివడి... ఆనాటి ఆ పలుకులే తిరిగి పెదవుల పైకి దొర్లుకొస్తుంటే... అంతరంగం నుండి అక్షరాలు ఆవిర్లుగా ఎగదన్నుకొచ్చి... తనలో తనే

గొణుక్కుంది.

భర్త వియోగాన్ని ఆమె గుండె తట్టుకోలేకపోతోంది! దిండు వైపు ముఖం వాల్చి ఆ వృద్ధ ప్రాణం పొర్లి పొర్లి దుఃఖిస్తోంది.

భర్త చనిపోయాక ఈ పదిరోజులూ రుక్మిణమ్మ నీళ్ళు కూడా సరిగా తాగలేదు. కానీ ఆగకుండా అప్రయత్నంగా కన్నీళ్ళు ఒలుకుతూనే ఉన్నాయి.

ఆ రోజంతా... ఆ రాత్రంతా..!

ఆహారం అసలే ముట్టడం లేదు. కానీ ఆమె నిస్తేజపు చూపులు ఆకలిగానే ఉన్నాయి. పోయిన భర్త కోసం... ఆయన సాంగత్యం కోసం!

అలుపెరుగని ఆమె హృదయాలాపనకి హద్దు లేక పోవచ్చు. కానీ ఊపిరికి పరిమితి ఉంది. పరిధి ఉంది.

✤ ✤ ✤

మెల్లగా మెలమెల్లగా తెల్లవారింది.

ఆ రోజు -

పదకొండవ రోజు!

**భర్త శాశ్వతంగా దూరమయ్యాక-**

**భార్య తాళి తెంచి... మట్టెలు తొలగించి... నుదుటి తిలకం చెరిపేసే... అమంగళకరమైన రోజు.**

పడతిని మానసిక క్షోభకి గురిచేసే నిర్దాక్షిణ్యపురోజు.

కానీ ఆ అవకాశం రుక్మిణమ్మ తన వాళ్ళకివ్వలేదు.

ఆ రోజు భర్త సమక్షంలో 'పుణ్య స్త్రీ'గా పోతానన్నట్టుగానే తన పంతం నెగ్గించుకుంది! మాట నిలబెట్టుకుంది!

తెల్లవారాక ఎప్పటిలాగే ఉదయం కోడలు... రుక్మిణమ్మ గదికి వచ్చి చూసేసరికి... ఆ వృద్ధురాలి పార్థివ దేహం కట్టెలా బిగుసుకుపోయి ఉంది.

ఆవిడ పెదవులు విచ్చుకుని ఉన్నాయి.

'ఏవండీ! నేనొస్తున్నా మీ వెనకాలే... నన్నొదిలేసి వెళ్ళకండీ...!' అని ఆర్తిగా భర్తని వేడుకుంటున్నట్టు.

కనురెప్పలు తెరిచే ఉన్నాయి.

'మీరే లోకంలో ఉన్నా నే వెతికి పట్టుకుంటాగా! అగ్ని సాక్షిగా మీ వెంట ఏడడుగులు నడిచిన దాన్ని ఏడేడులోకాలు తరలిరాలేనా?' అనే దీనాలాపానికి సంకేతంలా.

ఆ ఇంటి గుండె తిరిగి శోకసంద్రంలో మునిగిపోయింది.

(23.05.2010)

✻